# సబ్బు

పంపునీటి స్నానమంటే పడి చస్తాడు రమణ!

రమణకు ఇల్లు ఉంది. రమణకే గాదు ఆఊళ్లో అందరికీ ఇండ్లు ఉన్నాయి. అయితే రమణ ఇల్లు మాత్రం ఆ ఊరంత. రమణ యింటితో పోలిస్తే ఆ ఊరంతా గోరంత! ఆ ఇంట్లో తినడానికి- కూర్చొని కమ్మగా రేడియో వినడానికి-స్నానానికి పానానికి- నిద్రకు భద్రతకు వేరువేరుగా ఒకదానికంటే మరొకటి అందంగా- గదులున్నాయి. అందులో స్నానాలగది అమరికలేవేరు. ఆ గదిలో నిర్భయంగా నిబ్బరంగా ముచ్చటపడితే నగ్నంగా తొట్టిస్నానంతో తనివితీర్చుకోవచ్చు. షవర్‌జల్లు వానజల్లులా పైన పడుతూంటే - ఆనందంతో వంకర్లు తిరిగి పోవచ్చు. ధారాపాతమైన కొళాయి నీటి క్రింద జలకాలాడవచ్చు.

అయితే కూడా పంపునీటి స్నానమంటే పడిచస్తాడు రమణ.

ఊరిముందర బావి ఉంది. అది నడబావి. నడబావిలో నీళ్లు ఉన్నాయి. రెండు విద్యుత్ మోటార్లు ఒకదానితో ఒకటి పోటీపడ్తూ ముక్కుతూ మూలుగుతూ ఆ నీళ్లను పంపుద్వారా పైకి తెస్తాయి.

ఆ నీళ్లంటే మహా ఇష్టం రమణకు!

బావికి ఇటుప్రక్కన ఊరు ఉంది. అటు ప్రక్కన వాడ ఉంది. ఊరిలోను వాడలోను మనుషులే ఉన్నారు. మనుషులంతా ఒక్కటేనని మహాత్ముని అడుగుజాడల్లో నడిచిన సంస్కరాణాభిలాషులు గొంతెత్తి ఘోషిస్తూనే ఉన్నారు. అలాంటి సంస్కర్తల్లో గొప్ప సంస్కర్త ఆగ్రామ పంచాయితీ ప్రెసిడెంటు చెంగల్‌రెడ్డి. అప్పుడప్పుడు ఆగ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఆయన మీటింగు లాంటిది జరిపి 'జనులేమిటి?...హరిజనులేమిటి?...మనమంతా ఒకటి! జై బోలో మహాత్మాగాంధీకి!' అని గొంతు చించుకొంటూ ఉంటాడు. అప్పుడు అందరు ఆకాశం కూలిపడేటట్లు చప్పట్లు కొడతారు.

అయితే మాటలు మాటలే!-చేతలు చేతలే!

అందుకే -ఊరిలోని వాళ్లు జనులని, వాడలోని వాళ్లు హరిజనులని వ్యవహరింప బడుతూనే ఉన్నారు.

జనులు నీళ్లు తాగుతారు. జనులు హరిజనులు కలిసి నడబావి నీళ్లే ఉరవళ్లు పరవళ్లుగా పారుతూ ఉంటే పై నీళ్లు జనులు తాగితే, క్రింది నీళ్లు హరిజనులు తాగుతారు. మాసిన గుడ్డల్ని పిండుకొంటారు. కాయకష్టంతో చెమటోడ్చిన శరీరాలను కడుక్కొంటారు.

పారే నీటికి అంటు లేదని రాజీ పడతాయి ఇరువర్గాలు!

ప్రతిరోజు ఆఊరి పడమటి దిక్కున ఒకానొక కొండ కొన కొమ్మున నిలబడతాడు సూర్యుడు. పంపునీటి కాలువవైపు ఆశగా చూస్తూ ఉంటాడు. పడుచుదనం గడుసుదనంతో పరాచికాలాడుకొంటూ స్నానాలు చేస్తూ ఉంటుంది. తడి గుడ్డల్లోని సొగసుతోనేమో? సూర్యుడు తన్మయత్వంతో నిలబడి పోతాడు. అతని మొగం అరుణరాగ రంజితమై ఉంటుంది. ఆనందం వెల్లివిరిసి పడమటి దిశనంతా ప్రభావితం చేస్తూ ఉంటుంది. వాడికి 'కర్మ సాక్షి' అని ఎవరో నామకరణం చేశారు. ఎందుకలా చేశారో తెలియదు కానీ నిజంగా వాడు కర్మసాక్షి అయివుంటే ఆ కాలువ దగ్గరే చూపులు మళ్లించేవాడు. అక్కడ ముడతలు పడిన దేహాలు...వీపునంటుకొన్న కడుపులు...నిలబెట్టి కోసినా మందుకు బొట్టు రక్తపు చుక్కలేని శరీరాలు-చెమటను నీళ్లతో కలుపుకొంటాయి. ఈ దృశ్యమే వాడికంట పడిఉంటే నిజంగా ఆ నీళ్లలో కన్నీళ్లను కలిపేవాడేమో?

వాడికి ఆ మాత్రం ఓపిక లేకనేమో? పుటుక్కున గూట్లో పడతాడు.

పంపునీటి కాలువ దగ్గర పడుచుదనం నిర్భయంగా జలకాలాడుకొంటుంది.

ఆ సమయం ఆడవాళ్లకని కేటాయించారు. అందుకే ఆ సమయంలో ఓ మగ పురుగు మెదలమన్నా మెదలదు.

రమణకు ఈ సంగతి తెలియదు.

ప్రెసిడెంటు చెంగల్‌రెడ్డి కొడుకు రమణ పెరిగింది మురిపాల మూటల సందుల్లో! చదువుకొంటున్నది నాగరికత వొళ్లు విరుచుకొంటున్న పట్టణాల్లో! సాధారణంగా వేసవి సెలవులు గడిపేది నీలగిరి కొండల్లాంటి ఎత్తైన చల్లని ప్రదేశాల్లో!

అందుకే-ఆ పల్లెలోని పంపు నీటి కాలువ పరిస్థితి-ఆ గ్రామస్థులు అనుసరిస్తున్న పద్ధతి రమణకు తెలియదు.

అనుకోనట్లుగా ఆ ఏడాది వేసవి సెలవులు గడపడానికి రమణ పల్లెలోనే దిగాడు. ప్రెసిడెంటు చెంగల్‌రెడ్డిగారి కొడుకు వేసవి సెలవులు గడపడానికి పల్లెకు రావడం ఆపల్లెకే సంబరం!

ఒకనాటి సాయంకాలం వాహ్యాళికని బయలుదేరిన రమణ ఊరికి ఉత్తరంగా నిలబడ్డాడు. చుట్టూ కోతకొచ్చిన పొలాలు...పైరుగాలి కలగా పులగంగా కలిసి పరిమళాలు నింపుకొని రివ్వున వీస్తూ ఉంది శూన్యంవైపు. రకరకాల ఆకారాలతో మేఘాలు వినిర్మల నీలాకాశాన్ని 'కాన్వాస్'గా వాడుకొంటున్నాయి. ఊర్పిడి కాలం. వెచ్చని తలపులతో రైతుల

ఏలపాటలు వగలు పడుతున్నాయి. తోకలు పైకెత్తి ఆలమందలు పరుగుమీద ఇంటి ముఖం పట్టాయి. ఆ పరుగులో పైకి లేచిన గోధూళి సంజవెలుగులతో కలిసి కుంకుమ వెదజల్లినట్లుంది. ఆనందానుభూతితో రమణ తాడు విడిచిన మేక పిల్లలా గంతులు వేస్తున్నాడు.

"సహజత్వం ఎప్పటికీ సహజంగానే ఉంటుంది. తెచ్చిపెట్టుకోవడం తెచ్చిపెట్టుకున్నట్లు గానే ఉంటుంది."

పట్టణ వాతావరణంలో గడ్డకట్టిన రమణ గుండె పరవశించి కరిగి...మాటగా మారి పైరుపచ్చల్ని పలకరించింది.

పొద్దుగూట్లో పడింది. కనుచీకటి ఆవరిస్తూ ఉంది. రమణ తిరుగుముఖం పట్టాడు. కొత్త అనుభూతుల్ని నింపుకున్న మనసు రమణను గనిమల మీద తైతక్కలాడిస్తూ ఉంది. పరుగులాంటి నడకతో అతడు పడుతూ లేస్తూ నడుస్తున్నాడు.

ఆనందమే రూపమెత్తినట్లుగా పరవశించి పరుగుతీస్తున్న రమణ 'ఠకీ'మని ఆగిపోయాడు. రమణ కండ్లు ఇంతితయ్యాయి. వింతగా చూస్తున్నాడు. గుండె దడ దడలాడుతూ ఉంది. తనకు తెలియకనే తనలో ఏదో వేడి ప్రవేశించింది. కాలు ముందుకు పడమన్నా పడలేదు.

ఎవరో ఒక సుందరి! విరిసీ వియని కుసుమం!! పంపునీటి కాలువలో జలకాలాడు కొంటూ ఉంది నగ్నంగా!

రమణ ప్రయత్నం మీద చూపుల్ని స్వాధీనంలోకి తెచ్చుకో గలిగాడు ఒక్కటంటే ఒక్క నిమిషం. చుట్టు ప్రక్కల కలయ చూశాడు. ఎవ్వరూ కనిపించలేదు. తేలికగా నిట్టూర్చి తీరికగా ఆ సుందరివైపు దృష్టి మరల్చాడు.

ఊరిస్తున్న సొగసులు...మంచి పరువం మీద ఉన్న వయస్సు...అప్పుడే ప్రపంచాన్ని కొత్తగా చూస్తున్న అనుభూతి...అందాన్ని కండ్లు జుర్రుకొంటున్నాయి అందినంత మేరకు!

ఆ సుందరి గొంతుకూర్చుంది నగ్నంగా! మోవిని కాస్త పైకెత్తింది అందంగా! కండ్లు మూసుకొని ముంతతో నీళ్లు ముంచి ముంచి పోసుకొంటూ ఉంది హాయిగా!

చీకటి చిక్కబడుతూ ఉంది.

అక్కడున్నది తానొక్కతేనన్న అభిప్రాయంతో ఆ సుందరి!

అందుకే పంపునీటి కాలువలో నిర్భయంగా నిస్సంకోచంగా జలకాలాడుతున్నది. ముంతలో నీళ్లు ముఖంమీద పడి విశాల నేత్రాలతో వియ్యమంది నునుబుగ్గలపై జారి వక్షస్థలితో వగలుపడి కటిస్థలితో కబుర్లాడి కాలువలో కలిసిపోతున్నాయి చిలిపిగా!

'ఆ ముంతలో నీళ్లుగా మారిపోతే?'

ఉన్నట్లుండి కలిగిన కోరికతో కొంకర్లు తిరిగిపోతున్నాడు రమణ.

'ఆడది ఒంటరిగా అందులో నగ్నంగా స్నానం చేస్తూంటే చూడడం మహాపాపం! ఇప్పుడు కాకపోయినా ఇక కాసేపటికి ఆ అమ్మాయి కండ్లు తెరుస్తుంది. ఎదురుగా నువ్వుంటావ్!

కసిరినా కసరచ్చు. కాండ్రించి ఉమ్మినా ఉమ్మచ్చు. వెళ్లిపో, ఆ పరిస్థితి ఎదురుగాక ముందే వెళ్లిపో!' గుండెల క్రింది పొరల్లో నుండి ఏదో సందేశం గొంతులో మాటై హెచ్చరిస్తూ ఉంది.

'పాపమూ లేదు. పుణ్యమూలేదు. మళ్లీ మానవజన్మ ఎవరు చూశారు?... అందిన అవకాశాన్ని జారవిడుచుకోవడం వెర్రితనం. అనుభవించ గలిగినంత వరకు అనుభవించు' కోరిక కాళ్లకు సంకెళ్లువేస్తూ ఉంది.

విచిత్రమైన స్థితిలో ఇరుక్కొన్నాడు రమణ!

తెలియని స్వర్గం కోసరం తపించే తపస్వినిలా కళ్ళు మూసుకొని ముఖాన్ని పైకెత్తి ముంతలో నీళ్ళు ముంచుకొని సావకాశంగా ముఖాన కుమ్మరించుకొంటూనే ఉందా సుందరి!

నిడుపాటి వెంట్రుకలు నీళ్ళు పడడంతో చెదిరాయి. ఒంటిమీద పాయలు కట్టి పాలరాతి మీద జాలువారుతున్న నీలి నీలి సెలయేళ్ళులా భ్రమింప చేస్తున్నాయి. మోకాళ్ళను ముద్దిడుకుంటున్న చన్దోయి కవ్విస్తూ ఉంది.

"తంబురకు తలను ఆనించి భక్తి పారవశ్యంతో కనులు మూసి రాగాలాపన చేస్తూ మోవిని పైకెత్తి మురళీకృష్ణుని కోసం తపిస్తున్న మీరానా? లేక అనుకోని రీతిగా ప్రాణం పోసుకున్న అజంతా శిల్పమా??"

రమణ గుండెలో భావం గొంతులో మాటగా మారి 'ఓహ్' అనింది.

సుందరి అదిరిపడి కండ్లు తెరిచింది!

తాను కలలో కూడా ఊహించని పరిస్థితి. ఉలిక్కిపడింది. సిగ్గు...భయము...అసహ్యము అన్నీ కలిసినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో కండ్లు మూసుకొనింది. మోకాళ్ళ సందున అమాంతంగా తలదాచుకొనింది. రెండు చేతులు మోకాళ్ళను పొదివి పట్టుకొన్నాయి. తాకితే తల్లడిల్లుతూ ఒళ్ళు ముడుచుకొనే అంతర్దామరలా ఆ సుందరి క్షణక్షణానికీ ముడుచుకపోతూ ఉంది.

అయితే కండ్లు తెరిచిన ఆ ఒక్క క్షణంలోనే కనుపాపలు రమణను ఫోటో పట్టేశాయి.

ఓ మగవాడు తనని నగ్నంగా చూస్తున్నాడనుకొనేసరికి ఆ అమ్మాయి గిలగిలలాడిపోతూ ఉంది. అతని కంట పడనంత దూరంగా పరుగెత్తుకొని పోవాలని మనసు పరితపిస్తూ ఉంది.

చీరందుకోవాలి. కట్టుకోవాలి. ఆ తరువాతనే కదా పరుగెత్తాలి. ఎలా చేయాలి? ఎటూ తేల్చుకోలేక కుప్పగా కూర్చున్న ఆ సుందరి కుతకుత ఉడికి పోతూ ఉంది. పంపునీరు కాలువలో నీళ్ళు గోరువెచ్చనయ్యాయి.

ఇంచుమించు అదే స్థితిలో ఉన్నాడు రమణ.

అతడి నోరు తడబడుతూ ఉంది. ఏదో అడగాలన్న తపన. మాటలు దొరకడం లేదు. పెదవులు తడారి పోతున్నాయి. దొరకని మాటల్ని వెదుకుతూ తడారిపోతున్న పెదవుల్ని తడుపుకొంటూ మెలికలు తిరిగిపోతున్నాడు.

"ఎవ్వరీ అందాలరాశి! ఇంతటి ముగ్ధ మోహన సౌందర్యం ఈపల్లెటూళ్ళో ఎలా

ఊడిపడింది? అడిగితే!ఎలా అడగాలి?!అయ్యో! ఇప్పటికే తాను ఏమనుకొంటున్నదో?"

రమణ నిట్టూరుస్తున్నాడు. పంపునీటి కాలువ పరిసరాల్లో గాలి వేడెక్కింది. ఆ వేడి సుందరి తడిఒంటికి వెచ్చగా సోకుతూ ఉంది.

అందానికి వయస్సుకు ఎప్పుడో ఒప్పందం కుదిరినట్లుంది. ఆ సుందరి అనుకొన్నట్లు చేయలేకపోయింది.

చీకటి చిక్కబడింది. ఆకాశంలో చుక్కలు మొలిచాయి.

పంపునీటి కాలువ దగ్గర పాటించ వలసిన నియమిత కాలం దాటిపోతూ ఉంది. ఎవరో ఎద్దుల్ని అదిలిస్తూ అటు వస్తున్న శబ్దం చెవినిపడింది. ఉలిక్కిపడ్డాడు రమణ. అదృశ్యం ఎవరికంటైనా పడితే?అమ్మో! ఇంకేమయినా ఉందా? అసలే అవి పల్లెకొంపలు!

ఎద్దుల మెడల్లోని చిరుగంటల నాదాలు దగ్గరవుతున్నాయి. అడుగుమీద అడుగు పడినట్లుగా అడుగుల సవ్వడి ఆ జవ్వని చెవుల్లో పడింది. మెల్లగా కండ్లు తెరిచి మోకాళ్ళ సందుల్లో నుండే చూసింది.

రమణ మెల్లగా ముందుకు కదిలి పోతున్నాడు.

చూడకూడదనుకొంటూనే చూస్తూ ఉండి పోయిందా సుందరి. అతడు కనుమరుగయ్యాడో లేదో ఎగిరిపడి లేచింది. ఆదరాబాదరా చీరందుకొని ఒంటికి చుట్టుకొనింది. లేడిపిల్లలా ఉరికింది రమణ మనస్సు మాత్రం పంపునీటి కాలువ దగ్గరే పడిగాపులు కాస్తుంటే!

ఆనాటి నుండే పంపునీటి స్నానమంటే పడిచస్తున్నాడు రమణ!

ఇంతకాలంగా రమణ నాలుగ్గోడల మధ్యనే కూర్చున్నాడు. పుస్తకాల దొంతర్లను ముందు పేర్చుకొన్నాడు. అదే లోకం అనుకొన్నాడు. అయితే లోకంలో అంతకంటే తీయనయింది. అనుభూతిని ఆనందాన్ని యివ్వగలిగేది మరేదో ఒకటి ఉందని అనుభవానికి వచ్చేసరికి అతడు నాలుగ్గోడల మధ్య ఇమడలేక పోయాడు.

ఆరాత్రి డాబా మీద ఆరుబయట మంచం వేయించుకొన్నాడు. మెత్తటి పరుపుపైన తెల్లటి దుప్పటి మీద వెల్లికిలా పడుకొన్నాడు. మనసును పంపునీటి కాలువ దగ్గర వదిలివచ్చిన సంగతి అతనికి తెలియలేదు. మనసులేని కట్టె. ఎంత ప్రయత్నించినా పడక పొందలేదు. లేచి కూర్చున్నాడు.

ఎదురుగా వయ్యారాలు పోతూ ఆ నగ్న సుందరి!

తూరుపు కొండల పైన రెండు బారల ఎత్తులో నిలబడి నెలవంక...తోటలో విరిసిన మల్లెలు...మంద్రస్థాయిలో మారుతం - పరవశంతో రమణ పట్టుతప్పి పోతున్నాడు.

మెల్లగా పైకి లేచాడు రమణ. ఆ నగ్న సుందరిని అలాగే నిలబెట్టి వెన్నెలతో పోటీ పడుతున్న తెల్లటి చీర కట్టాడు. పట్టి మెల్లగా నడిపించుకొని వచ్చి పట్టెమంచంపై ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. కురుల తడి ఆర్చాడు. మెడమీద కాస్త వదులుగా నిడుపాటి జడ అల్లాడు. ఆ నల్లటి జడలో తెల్లటి మల్లెలు తురిమాడు. చందమామతో పోటీ పడుతున్న

ముఖారవిందంలో కందిపప్పంత బొట్టు పెట్టాడు. లేచి నిలబడి కాస్త వెనక్కు జరిగి వివిధ కోణాల్లో మార్చి మార్చి ఆమె అందాన్ని ఆస్వాదించాడు.

ముగ్ధమోహనంగా వెన్నెల్లో వెలిగిపోతున్న ఆ సౌందర్యరాశిని వదిలి పెట్టలేక వాటేసుకొన్నాడు.

ఊహ ఎంత తీయనిది!

రెండు చేతుల మధ్య నలిగి పోతున్న దిండువైపు దీనంగా చూశాడు రమణ.

వాస్తవం ఎంత చేదుగా ఉంటుంది.

ఆ రాత్రి రమణకు కంటి మీద రెప్ప పడలేదు.

అక్కడ వాడలో గుడిసె!

గుడిసె ముందు కుక్కిమంచంలో తండ్రి. ప్రక్కనే నేలమీద చిరిగిన ఈతాకు చాప. చాపమీద అమ్మ. అమ్మ ప్రక్కన సుందరి. చంద్రుడు- చకోరాలు- మల్లెలు -మొల్లలు- ఆప్రాంతానికే నిషిద్ధం.

"ఏమే? అట్లా నసుగుతుండావ్? నిద్రగాని పట్లేదా?"ప్రక్కలో నసుగుడు పోరు పడలేక అమ్మ అడుగుతూ ఉంది కూతుర్ని.

"అమ్మా! అయ్య అవసరం నీకు లేదు. నీ అవసరం అయ్యకు లేదు. అందుకే వాళ్లు తెలియకుండా నిద్రపోతున్నారు. కానీ ఎవరి అవసరం వాళ్లదమ్మా".

'అవసరం' అవసరాన్ని గుర్తించిన ఎవరైనా ఎవరికైనా చెప్పదగిన సమాధానమే అది. అయితే ఈ దేశంలో తల్లికి కూతురు అలా చెప్పకూడదు.

అందుకే ఆ సుందరి నోరు విప్పలేదు. ఆమె కూడా మనిషే కాబట్టి ఊహలు తప్పలేదు.

ఆసుందరి కనుపాపలు పట్టుకొన్న ఫోటోను తీసి ముందు పెట్టుకొనింది. నొక్కు నొక్కుల జుట్టు...కొసదేలిన ముక్కు...నవ్వితే సొట్టలు పడే బుగ్గలు...అంత పొడుగు అంత పొట్టి కాని మితమైన ఎత్తు-ఎంత అందంగా ఉన్నాడు? అతని ముందేకదూ? తనకు తెలియకనే తన అందాన్నంతా ఆరేసింది! ఆ గడియ అలాగే శాశ్వతమై పోతే?

"అమ్మో! ఎంతాశే నీకు? ఎర్రంగా బుర్రంగా ఉంటే మాత్రం? అంతో ఇంతో చదువుకోనుంటే కూడా జాతీ నీతీ మర్చిపొయ్యేదేనా? జాగర్త...ముక్కెలిరగదన్నేస్తాం! ఒక్కరు కాదు. ఇద్దరు కాదు. ఊరూరుగా తనమీద విరుచుక పడుతున్నారు.

'అమ్మో!' అని అరుస్తూ తల్లిని బల్లిలా కరుచుకొనిందా పిల్ల!

"ఏం పాడు కల్లో? ఏం పీడో! బిడ్డ బిత్తరక పోతా ఉండాది."

ఆతల్లి మనసు తల్లడిల్లింది. ఆ పిల్లదాన్ని లేపి కూర్చోబెట్టింది. గుక్కెడు నీళ్లు గొంతులో పోసింది. మళ్లీ పడుకోబెట్టి అందీ అందని పాత దుప్పటిని అంతంత మాత్రంగా కప్పింది. పొరకను కాళ్ల దగ్గర పెట్టింది పాడు కలలు రాకూడదని!

అయినా ఆ సుందరికి ఆరాత్రి పడక కుదిరితే ఒట్టు!

తెల్లారింది. తెల్లారింది మొదలు అనుకొంటూనే ఉందా సుందరి. అందరికంటే ముందుగా కాలువకు వెళ్లి రావాలని. అనుకొంటూ ఉండగానే పొద్దు కుంకింది. చీకటిపడుతూ ఉంది. కాలువకు వెళ్లినవాళ్లు ఒక్కొక్కరుగా తిరిగి వస్తున్నారు. ఆ సుందరి బయలుదేరేసరికి పంపునీటి కాలువ దగ్గర పలచబడింది. ఆమె అక్కడికి చేరే సరికి నిర్మానుష్యమయింది.

ఈ సంగతి ముందుగానే తెలిసి నట్లు రమణ కూడా అప్పుడే అక్కడికి వచ్చాడు.

ఆ సుందరి గొంతుకూర్చొంది నగ్నంగా మాత్రం కాదు. కూర్చొని ఓ బండమీద బట్టలు ఉతుకుతూ ఉంది. ఉతుకుతూ ఉన్నదన్న మాటేకానీ ఊపిరంతా ఎక్కడో ఉంది. పనిమీద లేని కన్నులు తమ పని తాము చేసుకొంటున్నాయి.

రమణ గుడ్డలు విడిచి కాలువ గట్టున పెట్టాడు. కాలువలో దిగాడు. పంపునీళ్ల పడే చోట ఆడుకొంటున్నాడు. పట్టణం నుండి ప్రత్యేకించి తెచ్చుకొన్న విదేశీ సబ్బు!! కండబట్టిన ఒంటిపై పొరాడి నురుగుగా మారి కాలువలో తేలి పోతూ ఉంది...పరిమళాలు వెదజల్లుతూ!

ఆ సుందరి అతడిని చూసీ చూడనట్లు చూస్తూనే ఉంది. గుండెల్లో కూడ పలుక్కొంటున్న కోరికల్ని గొంతులోనే అణచుకొంటూ ఉంది. అతడు గమనించనపుడు ఆ నురగను తీసుకొంటూ ఉంది. వాసన చూస్తూ ఉంది ఆశగా! మోచేతులకు పాదాలకు రుద్దుకొంటూ ఉంది ఆప్యాయంగా!!

సబ్బు నురగతో ఆమె పొందుతున్న అనుభూతిని రమణ ఒక కంట గమనిస్తూనే ఉన్నాడు. అందుకే ఆ కాలువ నీటి నంతా సబ్బు నురగ మయం చేస్తున్నాడు. పంపు నీటితో అతను పరాచికాలు ఆడుతుంటే సబ్బు నురగతో ఆమె దోబూచు లాడుతూ ఉంది. ఆ పరిసరాలు యౌవన సౌరభంతో ఎగిరెగిరి పడుతున్నాయి.

రమణ స్నానం ముగించాడు. బట్టలు తొడుక్కొన్నాడు. అడుగు మీద అడుగ్గా ఆమెను సమీపిస్తున్నాడు.

ఆ సుందరి అతడి రాకను గమనించింది. ఎగిరిపడి లేచింది. కాలికొద్దీ పరుగెత్తాలను కొనింది. కానీ కాళ్లాడ లేదు. ఎటూ కదలలేక తలవంచుకొని నిలబడింది.

రమణ కాలువకు ఇటువైపు ఎదురుగా నిలబడ్డాడు. అంతసేపు చన్నీటిలో స్నానమాడినా ఆదో రకమైన వేడితో ఒళ్లు కాలిపోతూ ఉంది. చిన్నగా తెపరాయించి గొంతు సర్దుకొన్నాడు. కొసరి కొసరి మాటల్ని కూడబలుక్కొన్నాడు.

"ఎవరమ్మీ నువ్వు"

ఉలిక్కిపడింది సుందరి. ప్రెసిడెంట్ చెంగల్‌రెడ్డి కొడుకు అడుగుతున్నాడు. చెప్పడానికి సిగ్గు. చెప్పకపోయేదానికి భయం. గుండెలు గుబ గుబ మంటున్నాయ్. ఎలాగో శక్తినంతా కూడదీసుకొనింది.

"రాముడి కూతుర్ని!" మాట పెగలలేక పెగిలింది.

"రాముడి కూతురివా?" వత్తి పలికాడు రమణ

"అవును"

శ్రుతి చేసిన తంబుర. అందమైన తంబుర. ఎవరో లయజ్ఞాన విహీనుడు మీటితే అపశ్రుతి పలికినట్లయింది.

"పేరు?"

"వరాలు"

రమణ తల దిమ్మెక్కి పోయింది.

'ఇది పల్లెటూరి సౌందర్యం కాదే!' అని ఆశ్చర్యపడిన రమణ ఆ అమ్మాయి మరీ అడుగంటిన జాతి నుండి అని వినే సరికి మరింత ఆశ్చర్యపడ్డాడు.

వరాలు గమనిస్తూనే ఉంది.

ఆ ముందటి రోజు కాలు కదపమన్నా కదలలేదు. ఈరోజు కాలు నిలదొక్కుకున్నా నిలిచేటట్లుగా లేదు. ఎంతలో ఎంత మార్పు?

రమణ వెనక్కు తిరిగాడు. మెల్లగా ముందుకు సాగాడు.

వరాలు పెదవులు వంపులు తిరిగాయి. ఆ వంపుల సందుల్లో ఏదో అనుమానపు నీడలకు ప్రతీకగా ఓ చిరునవ్వు.

పిండిన బట్టల్ని ఓ బుట్టలో వేసుకొనింది వరాలు. బుట్టను తీసి చంకన వేసుకొనింది. వరాలు కూడా బయలుదేరింది. ఆ పూటకు వాళ్లిద్దరూ విడిపోయారు! రమణ ఊరివైపు...వరాలు వాడవైపు!

ఆ ముందటి రోజు అనుభూతుల్ని గడపకివతల పెట్టి తాను మాత్రం ఇంట్లో అడుగు పెట్టి కంచంలో చేయి పెట్టినట్లు పెట్టి గుట్టుగా డాబాపైకెక్కాడు రమణ. అదే పట్టెమంచం...అదే మెత్తటి పరుపు...అవే వెన్నెల వెలుగులు...అవే మల్లెల మత్తులు అయినా మనసు నిండా చీకటి! ఆగిన రైలెక్కడానికి ఆతురత పడుతున్న ప్రయాణీకుల్లా తలలో దూరుతున్న ఆలోచనలు. పడక పొందక లేచి కూర్చున్నాడు.

ఎదురుగా వరాలు!

గుడ్డలు ఉతుక్కొంటున్నట్లు ఉతుక్కొంటూ అదోరకంగా చూస్తూ ఉంది.

"ఎందుకమ్మీ అలా చూస్తున్నావ్?"

"మీ రెందుకలా ఆలోచిస్తున్నారు?"

"ఆలోచించడం లేదు. ఆవేదన పడుతున్నాను."

"ఎందుకూ?"

"దేవుడెందుకిలా చేశాడా? అని!"

"మన చేతగానితనాన్ని దేవుడి మీద రుద్దడం తప్పు కదూ?"

"మరి దీన్నేమనాలి?"

"ఏమనాలంటే? దేవుడు బురదలో తామరలను పూయించడం లేదా? ముళ్ల సందుల్లో



4

గులాబీలను తొడిగించడం లేదా? అవి పూజకు ఉపయోగ పడడం లేదా? మనుషుల మధ్య కులాల అడ్డుగోడల్ని దేవుడు కట్టలేదు. ఒకనాటి అవసరంతో వాటిని మనమే కట్టుకున్నాం. అవసరం లేదనుకొన్నప్పుడు పడగొట్టాలి! ఏం? అనుకొంటే మీరాపని చేయలేరా?" వరాలు నిలదీసి అడుగుతూ ఉంది.

"అవును కొట్టాలి! దుమ్ము దుమ్మొగా పడగొట్టాలి!" ఆవేశంతో అంటున్నాడు.

"ఏంది సినబ్బా? ఏందో కొట్టాల గి.ట్టాల అంటా ఉండావే! ఎవుర్నబ్బా?"

ఉలిక్కిపడి ఈలోకంలో పడ్డాడు రమణ!

ఎదురుగా పుల్లయ్య తాత. పాలగ్లాసు చేత పట్టుకొని నిలబడి ఉన్నాడు.

"అన్నంకూడా సరిగ్గా తిన్లేదని అమ్మ అల్లాడిపోతా ఉండాది. మనసుండక తెచ్చినా! ఈపాలట్లా గొంతులో పోసుకో నాయినా!" బ్రతిమాలాడాడు పుల్లయ్య.

"అక్కడ పెట్టిపో తాతా!" పుల్ల విరిచినట్లనేసరికి పుల్లయ్యతాత రమణ ముఖంలోకి దిగులుగా చూస్తూ గ్లాసు అక్కడ పెట్టలేక పెట్టి తప్పదన్నట్లుగా వెళ్లలేక వెళ్లాడు.

రమణ పాలు తాగలేదు సరికదా ఆరాత్రి నిద్రకూడా పోలేదు.

పొద్దు పుట్టింది. పుట్టిన పొద్దు కుంకింది. ఆరోజు మాత్రమే కాదు వరుసగా పది రోజులు పుట్టింది. పుట్టిన పొద్దు కుంకింది.

ఈ పదిరోజులు సందకాడ సద్దుమణిగిన వేళ పంపునీటి కాలువ దగ్గర వీళ్లిద్దరి సందడే! ఇద్దరి గుండెల్లో వివరణకు అందని అలజడే!!

పదకొండవ రోజు కూడా తెల్లారింది.

రమణ ఒక నిర్ణయానికి వచ్చేశాడు.

తన నిర్ణయంతో తండ్రి స్వయార్జితం అల్లుళ్ల పరం కావడం ఖాయమని తెలుసు.

అయినా అతడు విద్యార్థిగా వర్ణాంతర వివాహాలపై ఇచ్చిన ఉపన్యాసాలు...ఎందరో మహాత్ములు చేసిన త్యాగాలు అతన్ని ముందుకు నెట్టుతున్నాయి. తాను చదువుకొంటున్న కళాశాలలో ఓ హరిజన కుర్రవాడు ఓ రెడ్ల అమ్మాయి తన కండ్లెదుటే పెండ్లి చేసుకొన్నారు. కాలేజీ కాలేజీగా వాళ్లను అభినందించింది. ప్రభుత్వం పారితోషికమిచ్చి ప్రోత్సహించింది. చదువు పూర్తయితే ఉద్యోగావకాశాలా? సరేసరి!

తన నిర్ణయాన్ని నిమిరి వదిలాడు రమణ.

పురులు విప్పి నాట్యమాడుతూ ఉంది నిర్ణయం గుండెల్లో!

ఆరోజు కూడా పొద్దు కుంకింది. సద్దుమణిగింది.

పంపునీటి కాలువ ఇద్దరి సందడితో సంబరాలు పోతూ ఉంది.

తన నిర్ణయాన్ని వరాలు చెవిలో వేద్దామని రమణ తహతహ పడుతున్నాడు. పంపునీటి కాలువ సబ్బు నురగతో మిసమిసలాడుతూ ఉంది.

అంతలోనే కూడపలుక్కున్నట్లుగా ఊళ్లో నుండి కొంతమంది వాడలో నుండి కొంతమంది

యువకులు అక్కడ ఊడిపడ్డారు.

రమణ వాళ్లనుచూసి ఉలిక్కిపడ్డాడు. రమణను చూస్తున్న వాళ్లు అందరూ ఒకరి మొగమొకరు చూసుకొన్నారు. వరాలు తనపని తనదన్నట్లుగా ఉంది.

జిల్లా స్థాయిలో కబడీ పోటీలు మరో పది రోజుల్లో జరుగుతున్నాయి. ఊరిలోని వాడలోని యువజన సంఘ సభ్యులు ఆ పోటీలో పాల్గొనడానికి తయారవుతున్నారు. ఆడిన తరువాత స్నానమాడడానికి వచ్చారు. ఆడవాళ్ల కోసం కేటాయించిన కాలం దాటి పోయింది కదా? అని!

ఓ నిముషం కాలువ గట్టున నిలబడింది యువతరం.

ఏదో ముచ్చటపడి రమణ వేళకాని వేళ పంపునీటి స్నానానికి వస్తే పగటిపూట పని తీరక గుడ్డలు పిండుకోవడానికి వరాలు వచ్చి ఉంటుందని యువతరం చూపులతోనే సర్ది చెప్పుకొనింది. ఆపై కేరింతలు కొడుతూ కాలువలో పడింది. పైనీళ్లలో ఊళ్లోవాళ్లు పడితే క్రిందినీళ్లలో వాడలోవాళ్లు పడ్డారు. పంపునీటి కాలువ దగ్గర కోలాహలానికి కొదవ లేకపోయింది.

ఊళ్లో యువకులు రమణతో కలిశారు. సువాసనలు వెదజల్లుతున్న సబ్బును తెగ మెచ్చుకొంటున్నారు. రమణ చేతుల్లో నుండి ఆ సబ్బును లాక్కొన్నారు. నిముషాల మీద చేతులు మారిపోయిందా సబ్బు. హుషారుగా పైనీళ్లలో స్నానాలు సాగుతుంటే సబ్బు నురగ తెట్టెలు గట్టి జోరుగా తేలిపోతూ ఉంది.

దర్జాగా చూస్తూ నిలబడ్డాడు రమణ.

క్రింది నీళ్లలో స్నానం చేస్తున్నదీ కుర్రవాళ్ళే!

ఆ కుర్రవాళ్లు సబ్బు నురగను రెండు చేతులతో జవురుకొంటున్నారు. తలకు ఒంటికి మార్చి మార్చి రుద్దుకొంటున్నారు. కొందరు దోసిటబట్టి ఊపిరి ఎగపీల్చినంత వరకు ఎగపీల్చి ఆ వాసనతో పరవశిస్తున్నారు. మెలికలు తిరిగిపోతున్నారు. సబ్బు రుద్దుకొంటున్న వాళ్లవైపు అదేపనిగా చూస్తున్నారు. ఆ చూపుల్లో ఆశ ఉంది. అభ్యర్థన ఉంది. అయితే గమనించే వాళ్లెవరు?

అలవాటు మేరకు ఆ సబ్బు నురగను దోసిట పట్టింది వరాలు. వంచిన తల ఎత్తకుండానే ఒక కంట గమనిస్తూనే ఉంది అక్కడ జరుగుతున్న జలక్రీడల్ని!

క్రింది నీళ్లను చూసి పైనీళ్లు వగలుపడ్తూ ఒళ్లు విరుచుకొంటున్నాయి. ఒళ్లు విరుచుకొంటూ పగలబడి నవ్వుతున్నాయి-నురగలు కక్కుతూ!

దోసిటబట్టిన సబ్బు నురగను విసిరి నీళ్లల్లో కొట్టింది వరాలు!

వాడలోని యువకులు తమ ఆశల్ని ఆ నీళ్లల్లోనే కలిపారు. కలిసికట్టుగా కాలువ పక్కన పుట్టమీద పడ్డారు. తలా పిడికెడు మట్టి తెచ్చుకొన్నారు. పైనీళ్లలో పరిమళాలు పోయే సబ్బు! క్రింది నీళ్లలో పనికి రాని పుట్టమట్టి!!

యువకులు స్నానాలు ముగించారు.

ఊళ్లోని యువకులు పరిమళాలు పోయే సబ్బుతో! వాడలోని యువకులు ప్రకృతి

ప్రసాదించిన పుట్టమట్టితో! ఆ తర్వాత వాళ్ల విడిపోయారు. ఊళ్లోని వాళ్ల ఊరివైపు, వాడలోని వాళ్ల వాడవైపు.

ఆ సమయం కోసమే ఎదురుచూస్తున్న రమణ గొంతు సర్దుకొన్నాడు.

"వరాలూ!... నిన్ను నేను పెండ్లి చేసుకొంటాను."

ఆమాట చెవిన పడడంతో ఒక్కసారి తలపైకెత్తింది వరాలు. ఒక్క చూపు విసిరింది వరాలు. నరనరాలను తాకిందా చూపు.

"ఎందుకలా చూస్తున్నావ్?" సందేహంగా అడిగాడు రమణ.

"చూడాల్సినట్లు చేశారు కాబట్టి చూస్తున్నా!"

"నేనేం చేశాను?"

"ఎవ్వరు చేసింది వాళ్లకు తెలిస్తే ఏ బెడదా ఉండేది కాదు."

"ఇదో ఈ అడ్డదిడ్డం మాటలు మానేసి అడిగిందానికి బదులు చెప్పు."

అసహనం పెరుగుతూ ఉంది రమణ మాటల్లో. తెగేదాకా లాగకూడదనుకొనింది వరాలు. సూటిగా అడగడానికే తలపడింది.

"అక్కడ పోతుండే వాళ్లెవరు?"

"ఊళ్లో వాళ్లు".

"ఇదో ఇటు పోతుండే వాళ్లెవరు?"

"వాడలో వాళ్లు"

"వాళ్లూ వీళ్లూ అందరూ మనుషులే గదా?"

"అవును."

"అయితే వాళ్లకిచ్చిన సబ్బు వీళ్లకెందుకు ఇవ్వలేక పోయారు?"

"వాళ్లడగలేదు కాబట్టి!"

"అడుక్కోవడం అంటే ముష్టెత్తుకోవడం అయ్యా! కాయకష్టం జేసి బతికే జన్మాలు ముష్టికిష్టపడవు."

"అంటే?"

"అంటేనా? మనుషులంతా ఒకటే అయితే గూడా కొందరికి లాక్కొనే స్వతంత్రం ఉంటే మరికొందరికి అడుక్కొనే అర్హత కూడా ఉండదండీ."

"ఆఁ!"

"అవునయ్యా!వాడలోని కుర్రవాళ్ల తపన గమనించారా మీరు? ఎంగిలి మెతుకుల కోసం ఎగబడే కుక్కల్లా మీ ఒంటి మీదనుండి జారిపడిన సబ్బు నురగ కోసం ఎలా ఎగబడ్డారో వాళ్లు. అసలు మీరెక్కడ చూడగలగతార్లే? ఈవారం పది రోజులనుండి తమరు చూస్తూనే ఉన్నారు. ఆ సబ్బు నురగతో నేనెంత సంబరపడి పోయానో? అయినా ఒక్కనాడైనా 'ఇదో! ఇందమ్మీ సబ్బు! ఆ నురగతోనే ఎందుకట్లా సతమతమైపోతావ్? అని మనసారా ఒక్క

మాటనలేకపోయారు. ఈ మాత్రం గుండె లేని మనిషి పెండ్లి చేసుకొంటాడా అయ్యా పెండ్లి."

వరాలు ఆవేశం వశం తప్పింది.

రమణ తల దిమ్మెక్కి పోయింది.

ఓ సబ్బు సురగతెట్టె!- గడ్డిపోచ అడ్డుపడితే అంతవరకు ఆగి ఉండింది. అప్పుడు ముందుకు సాగింది. నీటిపైన తేలిపోతూ ఉంది. అలా అలలమీద తేలిపోతూ పోతూ కొద్ది కొద్దిగా కరుగుతూ పూర్తిగా నీళ్ళలో కలిసిపోతూ ఉంది.

"చీకటికి చావు లేదు. తరతరాలుగా మీ మనసుల్లో పేరకపోయిన మురికికీ చావులేదు. ఆ మురికిని కడగాలంటే ఒంటిమీద మురికిని కడిగే ఈ సబ్బులు పనికిరావు. మనసుల్లో పేరకపోయిన మురికిని కడగాలంటే వేరే సబ్బులు తయారు కావాలి. దుమ్ము కొట్టుకపోయిన మీ మనస్తత్వాలు అలాంటి సబ్బుల్ని తయారుచేయడానికి చాలాకాలం పడుతుందయ్యా! చాలాకాలం పడుతుంది!!"

భారంగా నిట్టూరుస్తూ ఒక్క క్షణం ఆగింది వరాలు!

ఆమె అందానికే కాదు - మానసిక ఔన్నత్యానికి ముగ్ధుడైన రమణ రెప్పార్చకుండా ఆమెను చూస్తున్నాడు!

మరొక్క క్షణం ఇద్దరి మధ్య మౌనం!

"హ్హాహ్హాహ్హా! అంతవరకు ఎదురుచూసే ఓపిక ఉంటుందా అయ్యా! - ఒకవేళ ఉన్నా- ఆవేశంతో కూడుకొన్న మీ కోరిక ముందు ముందు ఎన్ని అనర్థాలకు దారి తీస్తుందో? - ఆ పరిస్థితిని ఎదుర్కొని నిలబడే శక్తి నాకుంది కానీ,.... మీకే లేదు!"

రమణ తల వాలిపోయింది!

ఒక్క ఊపులో తడి బట్టల బుట్టని చంకనేసుకొని నిర్లక్ష్యంగా విసిరిన చూపులు సమాధానం దొరకని ఎన్నో ప్రశ్నలై వర్షిస్తుంటే రమణ మనసు తడిసిందో లేదో కానీ మనిషి మాత్రం ముద్దగా కుంచించుకపోయాడు.

ఊరికి వాడ వేసిన ఒక సవాలు వరాలు! అణగారిన జనవనంలో విరిసిన చైతన్య గులాబీ వరాలు!!....

ఎక్కుపెట్టిన బాణంలా వాడవైపు దూసుకొని పోయింది!●

**- యువ (జనవరి 1981)**

**(చక్రపాణి అవార్డ్ ప్రథమ బహుమతి)**